నిర్వ్యాపారత

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

మగాడు పూట్లా కడుపు విచ్చేలాగ తింటూ, యేపనీ చెయ్యకుండా సోమరిపోతుగా కూచోడం, కాపురుషలక్షణం అని మన పూర్వులు నిర్వచించారు.

అది, కోపమూ గర్వమూ-ఇలాంటి దుర్గుణ మనీ, పురుషులకు తగని దనీ, విడిచిపెట్టెయ్యవలసిన దనీ వారు దాన్ని చాలా యేవగించుకున్నారు.

ఏపూట కాపూటే బియ్యపు నూకల కోసం తడుముకోవలసిన పాటకప్రజనమూ పని చెయ్యవలసిందే.

ప్రతీ వస్తువూ కాళ్ల దగ్గిరికి తెచ్చి దాఖలుచేసే రైతులు గల యినాందారూ పనిచెయ్యవలసిందే.

అన్నం కలిపి నోటి కందించడానిక్కూడా నౌకర్లు గల చక్రవర్తీ పనిచెయ్యవలసిందే.

ఈ విషయంలో వారు యేతరగతివారినీ మినహాయించలేదు.

దీన్ని పట్టి చూస్తే అప్పుడు పని లేకపోవడం అనేది వుండినట్టు కనపడదు.

"నువ్వే చెయ్యవలసినవి, అన్ని పనులు అలా మురిగిపోతూవుండగా, ఏమి టబ్బాయీ, మొద్దులాగ అలా కూచుంటావూ?" అని మందలించడానికా అన్నట్టుంది యీ సూత్రం.

కాని,

"చేద్దా మంటే పని దొరక్కుండా వుం" దని యిప్పటి యువకులు గోలపెడుతున్నారు.

ఈ గోలపెట్టేవారిలో ప్రైమరీ మొదలు పట్ట పరీక్షల దాకా చదివి ఉత్తీర్ణు లైనవా రున్నారు.

అసలు, పరకాయించి చూస్తే, చదువుకున్నవారిలోనే యీగోల కనపడుతూ వుంది.

ఈ నిర్వ్యాపారుల సంఖ్య తక్కువగా కూడా లేదు.

ఏ రోజు కారోజు వృద్ధిన్నీ అయిపోతోంది

దీన్ని పట్టి చూడగా, దొరతనంవారి విద్యాశాఖా, అటు దొరతనమూ ఇటు ప్రజలూ కూడా పూచీ పెట్టుకోకుండా వున్న విశ్వకళాపరిషత్తులూ విద్యాధికులకు బదులు నిర్వ్యాపారులను తయారుచేస్తున్నాయా అని సందేహించవలసినట్టు కనపడుతూ వుంది.

ప్రస్తుతం యీ నిర్వ్యాపారత ఆంధ్రదేశంలో బాహాటంగానే-నడివీధిలోనే చిందులు తొక్కుతూ వుంది; కాని రహస్యంగా-అంతఃపురాల్లో కాదు.

అయితే,

యువకుల గోలకల్లకంటే, మన రాజకీయ పక్షాలవారి మానిఫెస్టోలకల్ల యిది యెక్కువగా వెల్లడి అవుతూ వుంది.

ఇప్పటికి పదహారుసంవత్సరాలనుంచి అవిచ్ఛిన్నంగా అధికారం చెలాయిస్తూ వున్న జస్టిసు పక్షంవారూ యీ నిర్వ్యాపారతను నిర్మూలించేస్తా మంటున్నారు.

సుమారు అంతకంటె యెక్కువ రోజులనుంచే నిర్మాణకార్యక్రమం అంటూ భేరీలు మోగిస్తూ వున్న కాంగ్రెస్సుపక్షంవారూ దీన్ని రూపుమాపుతా మంటున్నారు.

నిన్న కాక మొన్న బయలుదేరి యింకాచక్కగా గడికట్టని పీపిల్సుపక్షమువారూ దీన్ని వెల్లగించివేస్తా మంటున్నారు.

తతిమ్మా విషయాల మాట యేమయిపోయినా, యీ నిర్వ్యాపారత విషయంలోనేనా యీ మూడు

పక్షాలవారూ యిలాగ యేకాభిప్రాయానికి రావడం బాగానే వుంది.

కాని,

ఒక పక్షంవారూ "ఇదిగో యీ విధంగా దీనికి ప్రతిక్రియ చేస్తా" మని చెప్ప రేం?

ఇదీ కాక:

నిజంగా వుద్దేశం వుండి, చెయ్యడానికి దీక్ష కూడా వుంటే యెప్పుడో చేస్తా మనడం యేమిటీ?

అసని యిప్పుడే యెందుకు మొదలు పెట్టకూడదూ?

పైగా,

జస్టిస్ కాంగ్రెస్ పక్షాలవారు ఇదివరకల్లా యేం చేశారూ?

దీనికి జవాబు కనపడదు.

ధోరణి చూడగా,

రేపు ఫిబ్రవరిలో జరిగే శాసనసభల యెన్నికలలో, కళ్లు మూసుకుని ప్రజలందరూ యేపక్షంవారికి వోటు చేస్తారో,

ఆవిధంగా మెజారిటీ కలిగించి యేపక్షంవారికి మంత్రిపదవులు దఖలు పరుస్తారో,

ఆపక్షంవారు ఈపని చేస్తా రన్న మాట.

లేకపోతే వారి పూచీ యేమీ లే దన్నమాట.

ఇదీ మర్మం.

అయితే,

శాసనసభలో మంత్రిపదవులు స్వాధీనపడితే గాని యీ నిర్వ్యాపారతను నివారించడాని కెవరికీ మార్గాలు లేవూ?

బయటనే వుండి యీ పని యెవరూ చెయ్య లేరూ?

హిందూదేశంలో-అందులోనూ ఆంధ్రదేశంలో కనక యీ ప్రకటనలు చెలామణీఅయిపోతున్నాయి.

నిజంగా యీరాజకీయపక్షాలవారు ప్రజలను మృగాలుగా భావించి నట్టుంది.

ప్రజలు అంధులు కారనీ, అవివేకులు కారనీ తెలుసుకుని వుంటే-అథవా, ప్రజలేనా తెలియ పరచగల స్థితిలో వుంటే వీరు ఇంత నిర్లక్ష్యంగా ప్రకటనలు చేసివుండకపోదురు.

అసలు ఈకుక్క రాజకీయపక్షాలవారికి ఆంధ్ర దేశపరిస్థితులు లేశమేనా అవగాహన అయివున్నట్టు తోచదు.

గ్రేటుబ్రిటనులో - ఫ్రాన్సులో - అమెరికాలో - ఇంకా అలాంటి దేశాలలో-అక్కడి రాజకీయపక్షాలవారిలాంటి ప్రకటనలు చేస్తా రంటే అందులో గంభీరమయిన అర్థం వుంటుంది

ఏమిటంటే?

అక్కడి యువకులకు చాలామందికి పనులు లేవు. చెయ్యతగ్గ పను లన్నీ యిదివరకే భర్తీ అయి పోయివున్నాయి

జీవితానికి ఆవశ్యకా లైన వస్తువులు, ఏరోజు కారోజే కొత్తకొత్తవి కావలసివస్తూవున్న యీరోజుల్లో, వారు, దేనికోసమూ-చివరకి గుండుసూదికోసం కూడా యితర దేశాలమీద ఆధారపడివుండరు. కనక, అసలు, అక్కడ, పనులే మన దేశంలోకంటే కొన్ని లక్షుల రెట్లు ఎక్కువ

పైపెచ్చు, నవనాగరికత పేరిట, ఆదేశాలలో, అనేకలక్షల యువకులు అనవసర మైన వస్తువులను సృష్టిస్తూ యిప్పటికే యెన్నో వింతపనులు కల్పించుకుని, అక్కడి యువయువతులకు బలవంతంగా వాటిమీద వ్యామోహం పుట్టించి, అపార మైన డబ్బు ఆర్జించుకుంటూ లక్షణంగా పొట్టపోసుకుంటున్నారు

ఇంతే కాక:

ఆదేశాల దొరతనాలవారు, తమ అధీనంలో వున్న అనేక యితర దేశాలలో సివిలు మిలిటరీశాఖలలో చెప్పకోతగ్గ పదవులు దఖలుపరిచిన్నీ, యితరవిధాల

కూడా యెన్నో పరిస్థితులు కల్పించిన్నీ తమతమ దేశీయయువకులలో అనేకలక్షలమందికి మంచిమంచి వరుమానాలు సమకూర్చి నిర్వ్యాపారత అంటే యేమిటో యెరక్కుండా చేసీ, చేస్తూనూ వున్నారు.

అయినా, యింకా అక్కడ పనిలేనివారు లక్షల కొద్దీ వున్నారు.

కడుపునిండా అన్నం పెడితే, వారు, కొండలు పిండికొట్టెయ్యగలరు.

అన్నందొరికే మార్గాలు చూపించకపోతే వారు సముద్రాలు కప్పెట్టెయ్యనూ గలరు.

జాతీయసంపద అంటే, ఆదేశాల్లో యువకులే మొట్టమొదట లెక్క పెట్టబడుతున్నారు.

కనక, వారి కందరికీ కొత్త పనులు కల్పించాలి.

కల్పించాలంటే దయాధర్మభిక్షంగా కాదు.

తమఔదార్యం ప్రకటించుకోడానికిన్నీ కాదు.

మన దేశంలోలాగ యెవరికో కాక, అక్కడి దొరతనాలు ఆయువకులకున్నూ జవాబ్దారీ వహించి వున్నాయి.

అంచేత, అవి, వారికి విధిగా పనులు కల్పించి తీరాలి.

అలా కల్పించడంలో, ఆపనులు, యువకులకు నిర్వ్యాపారత పోగొట్టగలిగేటట్టేకాక, జాతీయతకు పుష్టికలిగించేటట్టు-దేశానికి ఐశ్వర్యమూ బలమూ సమకూర్చగలిగే టట్టు ఉండాలి.

అధికారం స్వాధీనపరుచుకోడానికి ప్రయత్నాలు సాగించే రాజకీయపక్షాలవారికి ఆదేశాలలో యిది వొక పరీక్ష.

ఇది వారికి, అగ్నిపరీక్షకంటేనూ తీవ్రమైనది. కనుక వారు ఈనిర్వ్యాపారతను తొలిగిస్తామనే ప్రతిన తమతమ మానిఫెస్టోలలో వుదాహరించుకుతీరాలి.

తరవాత,

ఒక్కొక్క రాజకీయపక్షంవారికి దేశస్థితి వొక్కొక్కవిధంగా అర్థంఅవుతూవుంటుంది.

దాన్ని పట్టి వారు స్కీములు పన్ని కార్యక్రమాలు ఏర్పరుచుకుంటారు.

తహావ్వేలు వేసి చూసి ప్రజలు ఆకార్యక్రమాలను పరిశీలించుకుంటారు.

చివరికి ఏపక్షంవారి కార్యక్రమంలో పస కనపడుతుందో ఆపక్షంవారికి ప్రజలలో యెక్కువమంది వోటుచేసి రాజ్యాంగయంత్రం చేతి కందిస్తారు.

ఇక ఆపక్షంవారు తమ కార్యక్రమాన్ని ఆచరణలో పెడతారు.

ప్రతికూలపక్షమనే పేరున, మైనరుపక్షం వారు, అప్పుడు కూడా ప్రతిస్పర్ధ వహించి, యేమాత్రం సందు దొరికినా యెదురువాదం చేస్తూ, అడుగడుక్కీ ప్రతిష్టంభనాలు ప్రయోగిస్తూ తలప్రాణంతోకకు తెస్తూ వుంటారు.

ఈ ద్వంద్వయుద్ధంలో, అధికారంలో వుండే పక్షంవారికి, తమ లోటుపాట్లు చక్కగా విశదపడి, సవరణలు చేసుకోడానికి మంచి అవకాశాలు కలుగుతూ వుంటాయి.

వాటి నన్నిటినీ, వారు దేశోన్నతికోసం వినియోగపరచుకుంటారు.

ఈతొక్కిళ్లాటలో, వారు, మహోన్నత మైన విజయమో, అగాధ మైన అపజయమో పొందుతారు.

వ్రిముగం వేస్తే, అక్కడి మంత్రులను ప్రజలు నిమిషాలమీద దిగలాగేస్తారు.

ఏదీ?

మన దేశంలో మన రాజకీయపక్షాలు అలాంటి కట్టుదిట్టాలతో-అంత శాస్త్రీయంగా ఏర్పడ్డ వేనా?

పోనీ,

కొత్తయిండియాశాసనంలో మంత్రులకు అలాంటి అధికారాలు ఏర్పరచబడ్డాయా?

మన మంత్రులు తమ మానిఫెస్టోల ప్రకారం రాజ్యాంగాన్ని దిద్దివెయ్యగలుగుతారా?

మన దేశంలో పనిచేస్తూవున్న గవర్నర్లు మంత్రుల స్వతంత్రనిర్ణయాలను అమలుజరుపడానికే ఏర్పరచబడ్డారా?

అసలు, వారికేనా స్వతంత్రంగా వ్యవహరించడానికి వీల్లు ఉన్నాయా?

ఇది యిలా వుండగా,

గత్వా గత్వా,

మనకు, ఈక్షణంలోనే సంపూర్ణ స్వాతంత్ర్యం-బ్రిటిషువారికెలాంటి జోక్యమూ లేని పదహారుఅణాల స్వరాజ్యం వచ్చినా, చదువుకున్నవారి కందరికీ సర్కారుఉద్యోగాలే యివ్వడానికి సాధ్యంఅవుతుందా?

మన విద్యావిధానం జాతీయతకు అనుకూలంగా ఏర్పరచబడినా మన విశ్వకళాపరిషత్తులకు ఇప్పటికంటే యెక్కువ-అనగా వుండవలసినంత స్వాతంత్ర్యం వచ్చినా అవి తాము జయపత్రాలిచ్చి దేశంమీదకి విడిచిపెట్టిన యువకుల కందరికీ సర్కారునౌకరీలే వచ్చేటట్టు చెయ్యగలవా?

ఇంతకీ:

రాజ్యాంగవిధానం అన్నది, యేదేశంలోనేనా నిర్వ్యాపారత తొలగించడానికి యేదోవిధంగా అనుకూల్యాలే చూపిస్తుంది; కాని అది ప్రబలిపోయే యేర్పాట్లు చెయ్యదు.

కనక,

ఏపక్షానికి మంత్రాంగం స్వాధీనం అవుతుందో ఆపక్షం, నిజంగా తనకి ఫుద్దేశమే వుంటే, ఈనిర్వ్యాపారత్వాన్ని రూపుమాపడానికి ఏవో కొన్ని ప్రయత్నాలు సాగించవచ్చు.

అయితే;

ప్రస్తుతం ఆంధ్రదేశంలో ప్రబలివున్న-ఇంకా ప్రబలుతూనేవున్న నిర్వ్యాపారత చాలావరకు ప్రజానాయకులూ, సంఘసేవకులూ నివారించగలిగేదే; కాని రాజ్యాంగంవల్లమాత్రమే తీరేది కాదు.

అసలు, ఇవాళ, ఆంధ్రయువకులను పీడిస్తూవున్న నిర్వ్యాపారత పూర్తిగా అవివేకంవల్లనే యేర్పడింది.

ఇక్కడ ప్రజానాయకుల మనుకునేవారుకూడా పరప్రత్యయనేయబుద్ధులు కావడంవల్లనే - ఆత్మవిశ్వాసమూ, ఆత్మగౌరవమూ పాటించుకోకా-ఆకారణంవల్ల స్వతంత్రాలోచనలూ, దేశస్థితికి అనుకుణాలైన కల్పనలూ చెయ్యలేకా, ప్రతీదానికీ ఉత్తరాదినుంచి తాఖీదులు రావాలనే యెదురుచూసేవారు అయిపోవడంవల్లనే అది పెరిగిపోయింది.

వంగదేశం చూడండి.

మహారాష్ట్రం చూడండి.

గుజరాతీదేశం చూడండి.

పంజాబు చూడండి.

చివరకి, పక్కనే-కలిసేవున్న అరవదేశం చూడండి.

ఆదేశాలలో విద్యావంతులైన యువకు లందరూ సర్కారునౌకరీలే చెయ్యడం లేదు.

వారిలో చాలామంది సర్కారునౌకరీలకోసం ప్రయత్నాలే చెయ్యడం లేదు.

అసలు ప్రజానాయకుల ప్రవృత్తే ఆదేశాలలో యువకులకు స్వతంత్రజీవనమాధుర్యం చవిచూపిస్తూ వుంది.

ఇంగ్లీషువారితో కలిగిన పరిచయంవల్ల వారు పరిశ్రమల విలువ బాగా తెలుసుకున్నారు.

సామాన్యులు పదిమంది కలిస్తే బ్రహ్మాండమైన వొక నవశక్తి పుడుతుం దనే విషయం కూడా వారు చక్కగా తెలుసుకున్నారు.

ఇది అయినతరవాత, తాము నమ్మకంగా ప్రవర్తించడమూ, వొకరిని నమ్మడమూ నేర్చుకున్నారు.

ఇదంతా వారు ఆచరణలో పెట్టారు. చూస్తూ వుండగా లక్షలూ, కోట్లూ సంపాదించారు.

తమకు తమ దేశంలో వున్న మార్కెట్టు చాలక ఇతరరాష్ట్రాలకు ఎగబాకుతున్నారు.

ఇదంతా అక్కడి యువకులకు నూత్నాశలూ, నూత్న సంకల్పాలూ కలిగించింది.

దీంతో, స్వతంత్రకల్పన చెయ్యగల యువకు లనేకులు సర్కారు నౌకరీలను స్మరించడమే లేదు.

వారు, తమ సంతతపరిశ్రమవల్ల సర్కారు నౌకరీలో వున్న యువకులకంటే యెక్కువ డబ్బూ, పలుకుబడీ, గౌరవమూ సంపాదించుకుంటున్నారు.

మిద్దెలు, మేడలు, కార్లు-దర్జాగా కాలక్షేపం చేస్తున్నారు.

విద్యావంతులైన మన ఆంధ్రయువకు లలా కాదు.

మనవారికి సర్కారునౌకరీలే కావాలి.

చివరికి, ఎలిమెంటరీ స్కూలు టీచరుపని అయినా కావాలి.

ఎక్కువ అయినా సరే, తక్కువ అయినా సరే నెలపూర్తి అయేటప్పటికి జీతం అనే ముద్రతో యెంతో కొంత చేతిలో పడాలి.

మరోటి పనికిరాదు.

ఏం?

ఎంచేతా?

ఈదోషం అంతా, ప్రస్తుతం అమల్లో వున్న విద్యావిధానంమీదకి తోసెయ్యడం ధర్మం కాదు.

ఏమంటే?

ఆంధ్రదేశంలో వున్న విద్యావిధానమే యితర రాష్ట్రాలలో వుంది.

కాని,

అక్కడి ఫలితం వేరూ, యిక్కడి ఫలితం వేరూనూ.

ఏమో?

ఆంధ్రపట్టభద్రులలో,

భవభూతి, మాఘుడు, విద్యానాథుడు, మల్లినాథుడు, పండితరాయడు, నారాయణతీర్థుడు-మొదలైన సంస్కృత గ్రంథకర్తల సంతతివా రున్నారు.

నన్నయ్య, తిక్కన్న, యెర్రన్న, శ్రీనాథుడు, పెద్దన్న, సూరన్న, తిమ్మన్న, సోమన్న, భాస్కరుడు, పోతన్న మొదలయిన ఆంధ్రకవుల సంతతివా రున్నారు.

కాని,

ఇంగ్లీషులో గ్రంథరచన చేసిన తెనుగువాడుకన పడడు.

ఇలాంటి పట్టభద్రులే యితరరాష్ట్రాలవారు వందలకొద్దీ గ్రంథాలు రాస్తున్నారు.

వారిలో చాలామంది ఖండాంతరాలలోకూడా ప్రశంసలు పొందుతున్నారు.

ఏం?

ఈతేడా యెందుకు వచ్చిందీ?

ఇతరరాష్ట్రాలలో మంత్రులే శాసనాలు సృష్టించి ఇంగ్లీషుగ్రంథకర్తలను పుట్టించారా?

మదరాసుహైకోర్టులో ఆంధ్రమండలాలకు సంబంధించిన వ్యవహారాలు సగానికి పైగా వుంటాయి;

కాని,

అక్కడ తెనుగువకీళ్లు చాలా తక్కువ.

వెలుగువచ్చాక ఆకాశంమీద నక్షత్రాలు చూడాలంటే యెంత కష్టమో, మద్రాసులో తెనుగు వకీళ్లను చూడాలంటే అంత కష్టం.

తెనుగుయువకులు లాపరీక్షకు మద్రాసులోనే చదవాలి.

కాని,

ఆపరీక్ష పూర్తిఅయినతరువాత వారు మద్రాసులో క్షణం వుండలేరు.

అరవయువకులలో చాలామంది అక్కడే వుండిపోతారు.

ఏం?

అరవవారికి అనుకూల మైన శాసనా లున్నాయా?

పోనీ,

తెనుగుజిల్లాలలో లీడింగువకీళ్లుగా వున్నవారేనా సాహసించి మద్రాసులో ప్రవేశిస్తే బాగుండిపోవును.

ఏమంటే?

అలా చేస్తే-

కొత్తవారికి జిల్లాలలో పైకిరావడానికి అవకాశాలూ వుంటాయి.

మద్రాసులో పెద్ద పెద్ద తెనుగువకీళ్లూ చాలామంది వుంటారు.

తెనుగుకక్షిదారుల అవస్థలూ తప్పిపోతాయి.

అన్నిటికీ ముఖ్యం-

తెనుగుజిల్లాలలో, కక్షిదారులు బికారు లయిపోయినా, మదరాసులో తెనుగువకీళ్లేనా నవాబు లవుతారు.

కాని,

మనవాళ్లకి ఆసాహసం లేదు.

అధైర్యం లేదు.

అసలు ఆపురుషకారమే లేదు.

ఇంతెందుకూ?

తెనుగుజిల్లాలలో ప్రాక్టీసు చేసే వకీళ్లకు లాపుస్తకాలూ, పత్రికలూ కావాలంటే సాధారణంగా మద్రాసునుంచి రావాలి.

కాని,

ఇక్కడికి వచ్చి మనవాళ్లకు అపుస్తకాలూ అవీ అంటకట్టే యేజంట్లేనా తెనుగుయువకులు కారు.

మనకు కావలసిన వస్తువు లన్నీ సాధారణంగా ఖండాంతరాలనుంచి రావాలి.

అధమం-వాటిలో కొన్ని కలకత్తా, బొంబాయి పూనా, మద్రాసులనుంచేనా రావాలి.

ఆపట్టణాలలో సీమసరుకులు దిగుమతీచేసే వారిలో కాని, స్వదేశీవస్తువులు తయారుచేసేవారిలో కాని తెనుగువాళ్లు లేరు.

దీనికి సాయం,

నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం, గుంటూరు, బందరు, ఏలూరు, రాజమండ్రీ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం-ఇలాంటి తెనుగు పట్టణాల బజార్లలో ఒక్క గంట చూచుంటే బంగాళీలు, మహారాష్ట్రులు, గుజరాతీలు, పంజాబీలు-చివరికి అరవలు డజన్లకొద్దీ కనపడతారు.

వారి చేతుల్లో ఆర్డరుబుక్కు లుంటాయి.

శాంపిలుసరుకు నెత్తిమీద పెట్టుకుని వారికూడా కూలీ లుంటారు.

ఆ ఆంధ్రేతర్లందరూ ఆసీమసరుకులకూ, అస్వదేశీ వస్తువులకూ కేన్వాసింగుఏజంట్లు.

తెనుగుయువకులు ఆపని చెయ్యరు.

మన దేశంలో నిత్యవాడుకలో వున్న పత్తిబట్టలలో కొంతభాగం బంగాళీదేశంనుంచి వస్తాయి. కొంతభాగం. ముఖ్యంగా నాణ్యమైన సరుకంతా అచ్చతెనుగునగరమే అయిన బరంపురంనుంచివస్తుంది.

బరంపురంలో తెనుగుదేవాంగులే ఆసరుకు తయారుచేస్తారు.

కాని,

వాటిని తెనుగుదేశానికి తెచ్చి విక్రయించేవారంతా వోఢ్ర బ్రాహ్మలు.

తెనుగుబ్రాహ్మడే కాదు మరేకులంమనిషీ ఆపని చెయ్యడు.

ఏం?

తెల్లవారాటప్పటికి తెనుగువాడికి ఇడ్లీ సాంబారూ కావాలి.

వేడివేడి కాఫీ కావాలి.

తెనుగుదేశంలోనే పొరుగూరు వెడితే హోటల్ భోజనం కావాలి.

కాని,

తెనుగుదేశంలో మారుమూలవూళ్లలోకూడా అవి అయ్యరుదేవుడి ప్రసాదాలు.

తెనుగుదేశములో చెప్పుకోతగ్గ తెనుగుకాఫీ హోటలూ, తెనుగుహోటలూ లేవు.

అవి ప్రారంభించి తెనుగువాడు నిర్వహింపలేడు.

ఇంతేన ?

ఆహోటళ్లలో ఫలహారాలందించే యువకులూ, వడ్డన చేసే యువకులూ ఆంధ్రులు కారు.

తెనుగుదేశం మొత్తంమీద వారి సంఖ్య యెన్నో వేలమీద వుంటుంది.

ఏటా యెన్నో లక్షల సొమ్ము తెనుగుదేశంనుంచి బయటికి వెళ్లిపోతోంది.

దీనివల్ల తెనుగుదేశంలో కొంపలు కూలిపోతున్నాయి.

బయటి దేశాలలో మిద్దెలూ, మేడలూ లేస్తున్నాయి.

ఏం?

ఇక్కడ, నిర్వ్యాపారతవల్ల బాధపడుతూ వున్న తెనుగుయువకు లందరూ, హోటళ్లూ, కాఫీ హోటళ్లూ నడపడానికీ, వాటిలో పనిచెయ్యడానికీ సాహసించలేనంతటి గొప్పకుటుంబాలవారా?

వారందరూ రాజబంధువులా?

మన యువకులలో, తండ్రులు వంటలు చేసీ, నీళ్లు మోసీ, భిక్షం యెత్తీ సంపాదించిన డబ్బుతోటీ, తల్లులు రాత్రింబగళ్లు యింటింటా విస్తరాకులు తీసి సంపాదించిన డబ్బుతోటీ, సొంతంగా వారాలు చేసుకునీ ధనవంతుల బిడ్డలు కట్టివిడిచిన బట్టలూ, చదివిపారేసిన పుస్తకాలూ సంపాదించుకునీ- ఇంకా యిలాంటి అవస్థలతో విద్యావంతులైనవారు చాలామందేవున్నారు.

కాని,

వారికూడా సర్కారునౌకరీలే కావాలి.

వృత్తిచేసుకోడం నామోషీ.

తాలూకాబోర్డుల అమల్లోవున్న రోజుల్లో, ఏవో కష్టసుఖాలు విన్నవించుకోడం కోసం వచ్చి టీచరు కళ్లబడాటప్పటికి "నాన్సెన్సు, ఇడియెట్, స్టుపిడ్, రాస్కెల్, వెధవా, లద్దీకే, బుద్ధి లేదూ, గడ్డితింటున్నావా?" అంటూ పెద్దాపిన్నా తారతమ్యం యెరక్కుండా ప్రవర్తించిన ప్రెసిడెంట్లను యెరుగుదుము.

కాజుయల్ లీవు కావాలంటే వారం రోజులు ముందుగా దరఖాస్తు పెట్టుకోవాలనీ, ఆర్డరు చేతికి వచ్చేదాకా స్కూలు విడిచివెళ్లగూడదనీ కఠినంగా ఆజ్ఞలు జారీచేసిన ప్రెసిడెంట్లను యెరుగుదుము.

మన యువకులు అనేకులు, అలాంటివారి పాదాలు పట్టికూడా నౌకరీ సంపాదించుకోడానికే చూసేవారు గాని కాఫీహోటలు పెట్టుకోరాదూ? కుట్టుమిషను పెట్టుకోరాదూ? పోనీ కిల్లీదుకాణం పెట్టుకోరాదూ?" అంటే "పోవయ్యా" అని కసిరేవారు.

మనవాళ్లకి నౌకరీ అంటే అంత వ్యామోహం, వృత్తి అంటే అంత నిరసన.

మన పట్టభద్రులలో యెంతోమంది సరదా కోసం నాటకాలలో వేషాలు వేస్తారు.

మామూలు నటకులకంటే వారు చాలా బాగానే నటిస్తారు.

పైగా,

నటనకుతప్ప వారు మరొకందుకు పనికేరారు, కొంచెంశ్రద్ధపట్టి, కొంచెంపరిశ్రమచేసి కొంచెం దీక్షా కొంచెం యేకాగ్రతా వహిస్తే వారివల్ల ఆంధ్రనాట్యకళ యీపాటికి ఎంతో వున్నతికివచ్చివుండును.

వారికిన్నీ,

అసాధారణమైన ప్రజాదరణ వచ్చివుండును.

పుష్కలంగా డబ్బూ దొరుకుతూవుండును.

అయినా,

వా రాపని చెయ్యరు.

వారికిన్నీ సర్కారునౌకరీలే కావాలి.

ఫిలింపరిశ్రమవిషయంలోనూన్నూ యిదే జబ్బు. నిజంగాయిది విద్యావంతులేచేపట్టవలసినపరిశ్రమ.

ఈవృత్తి చేపడితే ఎన్నోవందల యువకులు కుబేరుడి బంధుకోటిలో చేరివుందురు.

కాని,

ఇవిన్నీ వారికి పనికిరాదు.

ఎన్నో తెనుగుఫిలిములు ఆంధ్రేతర ధనవంతులు తయారు చేయిస్తున్నారు.

ఎన్నో తెనుగుఫిలిములు ఆంధ్రేతర ధనవంతులు తయారుచేస్తున్నారు. ఎన్నో తెనుగుఫిలిములు ఆంధ్రేతర యువకులు డైరక్టుచేసీ, కంపెనీలుగా చేరి తయారు చేయించీ తెనుగుడబ్బు కొట్టుకుపోతున్నారు.

దీనివల్ల కళా జీవచ్ఛవం అయిపోతోంది.

తెనుగుయువకుల నోళ్లలో మన్ను పడుతోంది.

కాని,

ఎవరికీ విచారం లేదు.

ఇంతటితో తీరిపోతే వొక అందమే.

తెనుగువిద్యావంతుల దుస్థితి యింతతో ఆగలేదు.

చెప్పుకుంటే సిగ్గు.

తెనుగుదేశంలో మంగలిజాతి తక్కువగా లేదు.

ఆజాతివారు కులవృత్తి ఎ నకోనూ లేదు.

అయినా,

తెనుగువాడికి తల అంటడానికీ, వొళ్లు పట్టడానికీ వొడ్డిమంగలి కావాలి; తెనుగుమంగలి పనికిరాడు.

వొడ్డిమంగళ్లు వొక్క తెనుగువాళ్లకోసం మద్రాసుదాకా పాకి వున్నారు.

చెప్పవచ్చిం దేమి టంటే?

తెనుగువారి స్థితి యిలావుంది.

భారతదేశం మొత్తంమీద వున్న అవివేకం అంతా - దురభిమానం అంతా - భావదాస్యం అంతా తెనుగువాడి నెత్తెక్కి కూచునివుంది.

తెనుగుసంపాదకుడు ఇప్పటి విద్యావిధానానికి పునాదివేసిన మెకాలేను నిరసిస్తాడు.

ఇంగ్లీషు మన కొంప ముంచిం దంటాడు.

కాని,

హిందీని నెత్తెక్కించుకుని మురిసిపోతాడు

ఒళ్లు తెలవని ఆవేశంతో, తెనుగువాడు, హిందూస్థానీకి జయపెడతాడు.

గుజరాతీకి జయపెడతాడు.

బంగాళీకి జయపెడతాడు.

మారువాడీకి జయపెడతాడు.

అమెరికానుంచి నీగ్రో వస్తే కర్పూరదండ చేత పుచ్చుకొని హార్బరులో ముందు తెనుగువాడు ప్రత్యక్షం.

కాని,

తెనుగువాడు తెనుగువాణ్ణి లెక్క చెయ్యడు.

తెనుగువాడి అభ్యుదయం చూడలేడు.

తెనుగువాణ్ణి పైకి రానివ్వడు.

"తెనుగువాడూ వొక మనుషేటపోవోయ్" అంటాడు.

అసలు, తెనుగువాడికి తెనుగుతనమే పనికిరాదు.

తెనుగువాడు,

తురకల లుంగీ కడతాడు.

బంగాళీల లాల్చీ ధరిస్తాడు.

దానిమీద హిందూస్థానీల పొట్టికోటు వేస్తాడు

నెత్తిమీద గుజరాతీల టోపీ పెట్టుకుంటాడు.

ఆవల సాంబారు లక్షణంగా ఆస్వాదిస్తాడు.

సాటితెనుగువాడితో ఇంగ్లీషుతో మాట్లాడతాడు.

విద్యావంతులైన తెనుగుయువకుల స్థితి సాధారణంగా యిదీ.

ఇలాంటి తెనుగుయువకుడు నిర్వ్యాపారతవల్ల యిబ్బందిపడుతున్నాడంటే ఆశ్చర్యం యేమిటి?

ఇలాగ, తెనుగుయువకుడు సాంఘికంగా తీర్చుకోవలసిన నిర్వ్యాపారత యెంతో వుండగా మన కువ్వ రాజకీయపక్షాలవారు, కొత్త రాజ్యాంగంలో తమకు మంత్రాంగం దఖలుపరిస్తే ఏదో పొడిచేస్తామనడంలో యేమి అర్థం వున్నదీ?

ఔచిత్యంమాత్రం యేమి వున్నదీ?